క్లుప్తంగా

సాగర్ నీరు వృథా



వృథా అవుతున్న నీరు

బల్లికురవ: ప్రతి నీటి బొట్టూ అమృతంతో సమానం. అలాంటి సురక్షిత మంచినీరు అధికారుల నిర్లక్ష్యంతో వాగుల వంకల పాలవుతోంది. మండలంలోని వైదన రక్షిత పథకం నుంచి సూరేపల్లి, గ్రామానికి వెళ్లాల్సిన పైపులైన్ సాంకేతిక లోపాలతో రెండు గ్రామాల మధ్యనున్న బ్రిడ్జి వద్ద వారం రోజులుగా నీరు లీకు అవుతోంది. దీంతో సరేపల్లి గ్రామానికి రక్షిత నీరు చేరడం లేదు. ఫలితంగా ఆ గ్రామంలోని ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు లీకేజీని అరికట్టి సరేపల్లి గ్రామానికి చేరేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రాతి ముఖ మండపానికి విరాళం

అద్దంకి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి దాతలు విరాళాలు విరివిగా ఇస్తున్నారు. దానిలో భాగంగా గురువారం ఒగోలుకు చెందిన ఏ. ఉదయ్‌కుమార్ రాతి ముఖ మండప నిర్మాణానికి రూ.1,00,116 అందజేశారు.

సమష్టి కృషితో రైతన్నలకు సేవలు

మార్టూరు: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే రైతులకు మెరుగైన సేవలు అందించగలుగుతామని మార్టూరు మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రామినేని లావణ్య అన్నారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మండల వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బందితో సమావేశం అయ్యారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన ప్రతి రైతుకు కచ్చితంగా బయోమెట్రిక్ చేయించాలని గ్రామాల్లో దండోరా వేయించడం ద్వారా ప్రతి రైతుకు సమాచారం అందేలా చూడాలన్నారు. మట్టి పరీక్షల కోసం ఎక్కువగా వచ్చే నమూనాలను జిల్లా కేంద్రం బాపట్లలోని లేబరేటరీకి పంపాలన్నారు. లావణ్యను వీఏఓలు, వీఏఏలు పరిచయం చేసుకొని ఆమెకు అభినందనలు తెలిపారు.

కారంచేడులో క్షయ పరీక్షలు

కారంచేడు: మండలంలోని కారంచేడు 2 హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పలువురికి క్షయ పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ, హెచ్ఐవీ, పాత టీబీ కేసుల వారికి నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్, సీహెచ్ఓ పి. శాంతి ప్రియ, ఏఎన్ఎం పి. లక్ష్మీ తిరుపతమ్మ, ఎస్‌కే నజ్మా, ఎం. భారతి, డి. పేరమ్మ, బాబి, సురేంద్ర పాల్గొన్నారు.

ముగిసిన వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

యద్దనపూడి: మండలంలోని పూనూరుగ్రామంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరిరోజు ఆలయంలోని మూలవరులకు, ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఉత్సవాలు ముగిసినట్లు ఆలయ అర్చకులు దీవి బావానాచార్యులు ప్రకటించారు. కార్యానిర్వహణాధికారి జీవీఎల్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.



వేటపాలెం పోస్టాఫీసు రోడ్డులో నిల్వ ఉంచిన చెత్త దిబ్బ



పీఎస్ఆర్ సినిమా థియేటర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో పద్మశాలీ వీధిలో పేరుకు పోయిన చెత్త

అపరిశుభ్రం.. ఆందోళన

వేటపాలెం:

- వేటపాలెంలో పేరుకు పోయిన చెత్త కుప్పలు
- డ్రైనేజీ నుంచి కదలని మురుగునీరు
- ప్రజలను వేధిస్తున్న దోమల బెడద
- దోమల నియంత్రణకు చర్యలేవీ..?

మండలంలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రస్తుతం సీజన్ వ్యాధులు, మరో వైపు కరోనా భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఈగలు, దోమలు స్వైరవిహారంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. దోమకాటు కారణంగా జ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. వేటపాలెం పంచాయతీ పరిధిలో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. వీధుల్లో చెత్త దిబ్బలు పేరుకు పోయాయి. వారం రోజులుగా చెత్త దిబ్బలు తరలించక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే మరుగున పడుతోంది. డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ ఉండటం, కాలవల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు ఉధృతి ఎక్కువైంది. వార్డులో పారిశుద్ధ్య పనులతో పాటు రోడ్లపై వర్షం నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సరిహద్దుల సమస్యతో ప్రజలు అవస్థలు

వేటపాలెం- దేశాయిపేట పంచాయతీ గ్రామాలు రెండు కలిసి ఉంటాయి. అయితే రెండు గ్రామాలు సరిహద్దు రోడ్డులో వర్షం నీరు, చెత్త దిబ్బలు పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు మీద నిలిచిన మురుగు నీరు నెలల తరబడి రోడ్డు మీదనే ఉండి పోతోంది. ఈ నిల్వ ఉంచిన చెత్త దిబ్బలు, మురుగు కాల్వల్లో నిలిచిన వర్షం నీటిలో దోమలు పెరిగి పోయి రోడ్డుకి ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో చెత్తపేరుకు పోయి, వర్షపు నీరు నిల్చి పోయి అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు కల్పించుకొని చర్యలు చేపట్టకపోతే రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



మురుగు నీటి కావలో పేరుకు పోయిన చెత్తకాగితాలు

దోమల బెడద ఎక్కువైంది

వర్షాకాలం ఈగలు, దోమలు బెడద ఎక్కువైంది. మురుగు కాల్వల్లో మురుగు నీరు నిలిచి పోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ మురుగు నీటి నుంచి వచ్చే దోమలతో రాత్రి, పగలు నిద్ర ఉండటం లేదు. అధికారులకు దృష్టికి ఎన్ని సార్లు సమస్య తీసుకెళ్లానా పరిష్కరించడం లేదు.

కోటేశ్వరరావు: వేటపాలెం

కరిగిపోతున్న ధేనువకొండ



మట్టిని టిప్పర్లకు లోడ్ చేస్తున్న పొక్లెయిన్

అద్దంకి: రాక్షసగుళ్ల ఆనవాళ్లకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచిన మండంలోని ధేనువకొండ రోజు రోజుకు కరిగిపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి టీడీపీ సానుభూతిపరులు ఇసుక, మట్టిని కొండ మట్టిని సైతం వదలడం లేదు. దాంతో ధేనువకొండపై కన్నేశారు. ఆ కొండ మట్టిని పొక్లెయిన్లతో తవ్వి బయట ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఇదే విధంగా యథ్రమట్టి తోలకం సాగితే కొద్దిరోజుల్లోనే కొండ మొత్తం కరిగిపోతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మట్టి త్వకాలను నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ శ్రీచరణ్‌ను వివరణ కోరగా విషయం తన దృష్టికి వచ్చిందని, తవ్వకాలు నిలిపేశామని చెప్పారు. కొండ మట్టిని తవ్వితే చట్టపరమైన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి సునీల్ చౌదరి, ఉపాధ్యాయులు

కారంచేడు: గ్రామంలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని హైకోర్టు రిటైర్డ్ జడ్జి తాళ్ళూరి సునీల్ చౌదరి అన్నారు. గ్రామంలోని వైఎస్ఓ ప్రభుత్వ పాఠశాలను గురువారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాలయానికి.. గ్రామం దాదాపు 2 కి.మీ దూరం ఉండటంతో విద్యార్థులు పాఠశాల రాకపోకలకు ఆర్టీసీతో పాటు గౌతమ బుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ తరఫున రవాణా సమకూర్చుతామని సంస్థ ప్రతినిధులు యార్లగడ్డ రాఘవయ్య, చుండూరి రామయ్య తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ కరస్పాండెంట్ యార్లగడ్డ రఘుబాబు, ఎంఈఓలు ఎంవీ సత్యనారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు, హెచ్ఎం సామ్రాజ్యం, యార్లగడ్డ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల అర్బన్: అత్యవసర సమయంలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. గురువారం చీరాల్లోని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన శిబిరం నిర్వహించడం సామాజిక బాధ్యత అన్నారు. అత్యవసర సమయంలో రోగులకు రక్తం అందుబాటులో ఉండేలా చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్రను పోషిస్తాయన్నారు. రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలన్నారు. హాస్పిటల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శిబిరంలో విద్యార్థులు, ఆరోగ్య సంరక్షణ కార్మికులు, ప్రజలు 90 మంది రక్తదానం చేశారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవి కిరణ్ మాట్లాడుతూ రక్తదానం అనేది అత్యంత గొప్ప సేవా కార్యక్రమాల్లో ఒకటని, అత్యవసర పరిస్థితుల్లో, శస్త్రచికిత్సల్లో ఒక యూనిట్ రక్తం ప్రాణాలను కాపాడుతుందన్నారు. రక్తదానం చేసినవారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు, సేవాభావం



ఎన్‌సీసీ కేడెట్లతో కెప్టెన్‌లు

వేటపాలెం: ఎన్‌సీసీ కేడెట్స్ నాయకత్వ లక్షణాలు, సేవాభావాన్ని పెంపొందించుకోవచ్చని 23 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి ఎన్ఎస్ పర్మర్ పేర్కొన్నారు. చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో 23వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కెరీర్ గైడెన్స్‌పై నిర్వహిస్తున్న కార్యక్రమం గురువారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం ద్వారా మంచి నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పం, సమాజానికి ఉపయోగపడే విధంగా ఉంటుందన్నారు. కేడెట్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు, సైనిక సేవ, పబ్లిక్ సెక్టార్, ప్రైవేట్ రంగం మొదలైన విభిన్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించారు. వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలను పట్టుకుని విజయం సాధించడానికి ఎన్‌సీసీ కేడెట్స్‌కు కావాల్సిన ప్రాముఖ్యతలు, సరైన ప్రణాళిక, కష్టపడి పనిచేయడం ముఖ్యమన్నారు. కేడెట్లు దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు శారీరక దృఢత్వం పొందుతారని తెలిపారు. భవిష్యత్తులో వీరు దేశ సేవకు సిద్ధంగా ఉండగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాంపు అడ్జటెంట్ మేజర్ వై. అంజిరెడ్డి, కెప్టెన్ పాతూరి శ్రీనివాస్, లెఫ్టినెంట్‌లు హరీష్, మేడికొండ రాజేష్ బాబు, శ్రీమన్నారాయణ, శేషగిరిరావు, ఫాతిమా, గోపీనాథ్, సుబేదార్, ముకేశ్‌కుమార్, బీహెచ్ పి. రమేష్ పాల్గొన్నారు.

నిత్యం యోగా చేస్తే ఆరోగ్యం



యోగాపై శిక్షణలో పాల్గొన్న తహసీల్దార్ బ్రహ్మయ్య, రెవెన్యూ సిబ్బంది

పర్చూరు(చినగంజాం): నిత్యం యోగా చేస్తే అనారోగ్య సమస్యలు దూరం అవుతాయని మండల యోగా పర్యవేక్షకులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని రెవెన్యూ సిబ్బంది కార్యాలయ ఆవరణలో నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా పర్యవేక్షకులు చంద్రశేఖర్ మాట్లాడుతూ నిత్యం యోగా చేయటం వలన అనారోగ్య సమస్యలు దూరం అవుతాయని వివరించారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, మండల సర్వేయర్ బాల వీరాంజనేయులు, వీఆర్వోలు యార్లగడ్డ శ్రీనివాసరావు, గోవిందరెడ్డి, షేక్ హుస్సేన్, శిరీష పాల్గొన్నారు.

CHANGE OF NAME

I Satyanarayana Yanumula R/o Ramula vari Temple Main Road, Gavinivari palem, Chirala Mandal, Bapatla Dist, A.P- 523166. Changed my Wife Sur Name Daya Krupa Yemenel to Yenumula Daya Krupa.

చదువుల తల్లికి స్వాగతం



వేటపాలెం: అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ, పట్ట భద్రులు సంఘం కార్యవర్గం



పర్చూరు: అక్షరాభ్యాసంలో చిన్నారులు, అంగన్‌వాడీలు



మేదరమెట్లలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న అధికారులు, తల్లిదండ్రులు

– 30 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం

వేటపాలెం: మండలంలో మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టి. ఝాన్సీ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పట్ట భద్రుల సంఘం ఆధ్వర్యంలో జీవీకేసీ ఏంఫర్ సేవా కేంద్రంలో జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ప్రసంగించారు. ఐదేళ్లు నిండిన చిన్నాలకు గ్రాడ్యుయేషన్ డే కూడా నిర్వహిహించాలన్నారు. పౌష్టికాహారంతో పాటు ఆట పాటల ద్వారా విద్యను అభ్యసించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. పట్ట భద్రుల సంఘం అధ్యక్షుడు ప్రతి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యక్తలు తమ కేంద్రాలకు వచ్చే చిన్నారులను తమ బిడ్డలుగా భావించి విద్యా బుద్ధులు నేర్పించాలని సూచించారు. 30 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. విశ్రాంత ఆర్‌జేడీ ప్రయాగరావు, సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బట్ట మోహన్‌రావు, సహాయ కార్యదర్శి నాగాంజనేయులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సజ్జా పుష్పవల్లి, జ్యోతి, ప్రత్తి శరత్‌బాబు పాల్గొన్నారు.

మేదరమెట్ల: స్థానిక సచివాలయంలో ఐసీడీఎస్ కొరిశపాడు ప్రాజెక్టు పరిధిలోని చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సీడీపీవో కృష్ణకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు మెరుగైన విద్యను అందచేస్తామన్నారు. కార్యదర్శి లక్ష్మీకాంత్, సూపర్‌వైజర్ అరుణాదేవి పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): నూతలపాడులో అంగన్‌వాడీ కార్యకర్తలు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం నూతలపాడు పంచాయతీ పరిధిలోని అంగన్ వాడీ కార్యకర్తలంతా కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీఓ సుభద్ర, గ్రామ సర్పంచ్ చిన్నయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, సుభాషిణి, రత్నకుమారి, మాధవి, కృష్ణవేణి, సువర్ణ, క్రాంతి కుమార్, సునీత రాణి పాల్గొన్నారు.

కారంచేడు: ఇంకొల్లు అంగన్‌వాడీ ప్రాజెక్ట్ పరిధిలోని కారంచేడు మండలంలో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. కారంచేడు పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బాలిగ శివపార్వతి ప్రారంభించారు. కార్యదర్శి రమేష్, సూపర్ వైజర్ హిమబిందు, మహిళా పోలీసులు, అంగన్ వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మార్టూరు: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని దానిని నిర్లక్ష్యం చేసి వెనుకబాటు తనానికి గురి కావద్దని ఐసీడీఎస్ పర్చూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సుభద్ర అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ద్రోణాదుల ఎస్టీ కాలనీ లో గురువారం నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పిల్లలు వారి తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్, సూపర్‌వైజర్ కె. పద్మ, ఏఎన్ఎం మోహిని, మహిళా పోలీస్ సుధ పాల్గొన్నారు. మండల కేంద్రం మార్టూరు గొట్టిపాటి హనుమంతరావు కాలనీలోని సచివాలయం- 3 పరిధిలో కార్యకర్తలు రాజేశ్వరి, రమాదేవి, సునీత, నాగ పుష్పారాణి, శైలజ, కమలమ్మ, అంజలి తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: పూనూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. సీడీపీఓ సుభద్ర, మాజీసర్పంచ్‌లు బోయపాటి సాంబశివ రావు, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, హెచ్ఎం అనురాధ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ

చీరాల టౌన్: మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూతన ఎంపీడీఓ బి.శివన్నారాయణ అన్నారు. చీరాల ఎంపీడీవోగా పనిచేస్తున్న శివసుబ్రమణ్యంను గుంటూరు జెడ్పీ కార్యాలయానికి బదిలీ చేయగా చీరాలకు ఎంపీడీవోగా డీఎల్‌పీవోగా పనిచేస్తున్న శివన్నారాయణను నియమించారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

నూతన ఎస్టీవోగా రమణారెడ్డి

చీరాల ఉపఖజానా కార్యాలయం ద్వారా ఎలాంటి వివాదాలు లేకుండా విధులు నిర్వహిస్తానని నూతన ఉపఖజనాధికారి దేవిరెడ్డి రమణారెడ్డి అన్నారు. చీరాల ఉపఖజానా కార్యాలయానికి నూతన ఎస్టీవోగా రమణారెడ్డిని నియమించారు. ఇక్కడ ఎస్టీవోగా పనిచేస్తున్న నిజాముద్దీన్ వెంకటగిరికి బదిలీ కాగా నెల్లూరు జిల్లాలో ఎస్టీవోగా విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డిని చీరాలకు బదిలీ చేశారు.



పుస్తకాల కిట్‌లు అందజేత



పర్చూరు: విద్యార్థులకు పుస్తకాల కిట్‌లు అందజేస్తున్న సీఎంఓ శ్రీనివాసరెడ్డి



కొరిశపాడులో పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్న అతిథులు

పర్చూరు(చినగంజాం): పర్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు ఒంగోలు సర్వశిక్షా అభియాన్ సీఎంఓ పి. శ్రీనివాసరెడ్డి పుస్తకాల కిట్‌లు అందజేశారు. గురువారం పాఠశాల పునఃప్రారంభం రోజున విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రతి కిట్‌లో ఒక బ్యాగుతో పాటు మూడు జతల బట్టలు కుట్టుకూలీ, బూట్లు, సాక్స్‌లు, టెక్స్ట్ పుస్తకాలు, రాత పుస్తకాలు ఉన్నట్లు వివరించారు. ఎంఈఓ వెంకట రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేడీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఎం. నాగిరెడ్డి, వైవీ సుబ్బారావు, ఎస్. కిషోర్, హనుమంతరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మేదరమెట్ల: స్థానిక జగ్జీవన్ నగర్ నందు గల ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా టెక్స్ట్ బుక్స్, యూనిఫాంను సీడీపీఓ కృష్ణకుమారి గురువారం తల్లిదండ్రులకు అందచేశారు. ఆమె మాట్లాడుతూ పిల్లలు శ్రద్ధగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని తద్వారా తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. హెచ్ఎం మురళీకృష్ణ, ఉపాధ్యాయులున్నారు.

బిల్లు చెల్లింపుల్లో జాప్యం.. సబ్ సెంటర్‌కు శాపం



అసంపూర్తిగా నిలిచిన భవనం

బల్లికురవ: గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ సబ్ సెంటర్‌కు దాత స్థలం కేటాయింపుతో భవనం నిర్మించినా బిల్లు చెల్లింపులో జాప్యంతో దాత ఆశయం నెరవేరడం లేదు. మండలంలోని వల్లాపల్లి గ్రామ కూడలిలో ఎంతో విలువైన ఐదు సెంట్ల స్థలాన్ని బాదం రామచంద్రారెడ్డి 2022లో వైద్య ఆరోగ్య శాఖకు గ్రామంలోని ప్రజలకు సేవలు చేసేందుకు సబ్‌సెంటర్‌కు ఉదారంగా ఇచ్చారు. ఈ స్థలంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18 లక్షల నిధులతో హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మించారు. అంచనాలకు సంబంధించి పనులు పూర్తి చేశారు. తుది దశలో తలుపులు, పెయింటింగ్‌కు నిధులు చాలనందున పనులు అసంపూర్తిగా నిలిచాయి. చేసిన పనులకు సైతం రూ.9 లక్షలు మాత్రమే తనకు జమ అయ్యాయని దాత తెలిపారు. చెల్లించాల్సిన రూ.9 లక్షలకు తోడు మరో రెండు లక్షలు కేటాయిస్తే తుది దశ పనులు పూర్తి చేసి భవనాన్ని అప్పగిస్తామని రామచంద్రా రెడ్డి ప్రకటించారు. భవనం పూర్తికానందున అద్దె భవనంలో అసౌకార్యాల మధ్య వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు కాలం వెళ్లదీస్తున్నారు.

